క్లుప్తంగా

రేపు మెగా రక్తదాన శిబిరం

రఘునాథపల్లి: స్థానిక బస్టాండ్ సమీపంలోని ఎల్లమ్మ గుడి వద్ద స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా వెలుగు యూత్ ఆధ్వర్యంలో ఆక్సిజన్ ఫార్మసీ, శ్రీసాయి ఎలక్ట్రానిక్స్, హోంనీడ్స్, ఫర్నీచర్స్ సహకారంతో ఈ నెల 13న మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు యూత్ సొసైటీ ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడేందుకు ఆరోగ్యంగా ఉన్న యువకులు రక్తదానం చేసేందుకు తరలి రావాలని వారు కోరారు.

సంజీవకు జాతీయ అవార్డు



లింగాలఘణపురం : మండల కేంద్రానికి చెందిన సాంస్కృతిక సారథి గట్టగల్ల సంజీవకు జాతీయ జానపద కళారత్న అవార్డును తారా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సినీదర్శకుడు బెల్లంకొండ రమేష్, ఆర్ట్స్ అసోసియేషన్ చైర్మన్ సంకె రాజేశ్ అందజేశారు. ఆల్ ఇండియా కల్చరల్ అండ్ ట్రైబల్ డాన్స్ ఫెస్టివల్ తెలంగాణ ప్రభుత్వం తారా ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందజేశారు. అవార్డు గ్రహీత సంజీవ మాట్లాడుతూ తన కళానైపుణ్యాన్ని గుర్తించి అవార్డు అందజేసిన ప్రతి ఒక్కరికి, అవార్డు వచ్చే విధంగా కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

అనాథ పిల్లలకు అన్నదానం

కొడకండ్ల : వెలిశాలలోని ఫ్రెండ్లీ కేర్ అనాథ ఆశ్రమంలోని పిల్లలకు శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొమ్మగాని విక్రంగౌడ్ అన్నదానం చేసి పండ్లు పంపిణీ చేశారు. తన జన్మదినాన్ని పురస్కరించుకొని అనాథ పిల్లలకు అన్నదానం చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో నాగరాజు, మురళీ, రణధీర్, అశోక్, మహేందర్, శ్రీకాంత్, భూపాల్, రఘు, శివసాయి, సునీల్, మధు, శంకర్, శ్రవణ్, ఆదర్శ్ పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం



బచ్చన్నపేట : నూతనంగా వచ్చిన ఎస్సై కంకల సతీష్‌కుమార్‌ను పలువురు నాయకులు సన్మానించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సతీష్‌ను బీఆర్ఎస్ నాయకులు శాలువాలతో సన్మానించారు. సన్మానించిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొడిగం చెంద్రారెడ్డి, నాయకులు చల్ల శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు నరెడ్ల బాల్‌రెడ్డి, గంగం సతీష్‌రెడ్డి, నాయకులు నూకల నర్సిరెడ్డి,రాజనర్సు, జిల్లా సందీప్, షబ్బీర్, తదితరులు ఉన్నారు.

బస్‌పాస్‌ల అందజేత



బచ్చన్నపేట : మండలంలోని పలు గ్రామాల విద్యార్థులకు ఆర్టీసీ బస్‌పాస్‌లను అందజేశామని రైతుబంధు సమితి మండల కో–ఆర్డినేటర్ చల్ల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మన్‌సాన్‌పల్లి, సాల్వాపూర్, లింగంపల్లి, పుల్లగూడెం, పడమటికేశ్వాపూర్ గ్రామాలకు చెందిన విద్యార్థులకు బస్‌పాస్‌లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని విద్యార్థులు సకాలంలో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లడానికి ఆర్టీసీ రవాణా సౌకర్యాలను సకాలంలో కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజపేట గోపాల్, వనం కిషన్, తాడెం నరేందర్, మహదేవ్, బావండ్ల గణేష్, తరిగొప్పుల నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ నేతలను కలిసిన ధన్వంతి దంపతులు



దేవరుప్పుల: మండలంలోని మాదాపురం గ్రామానికి చెందిన టీపీసీసీ సభ్యులు డాక్టర్ లాకావత్ లక్ష్మీనారాయణనాయక్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ ధన్వంతి దంపతులు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను శుక్రవారం ఢిల్లీలో కలిశారు. పాలకుర్తి నియోజకవర్గ పార్టీ స్థితిగతులు, అభ్యర్థుల నియామకంపై చర్చ జరిగింది. స్థానిక సర్వేలతోపాటు అధిష్టానం అభిప్రాయం మేరకు ఎవరికి టికెట్ వచ్చినా ప్రత్యర్థిని ఓడించి కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు పాటుపడాలని సూచించారు. వీరి వెంట జనగామ మార్కెట్ మాజీ చైర్మన్ ఎర్రమల్ల సుధాకర్, మాజీ కౌన్సిలర్ మేడ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

యుద్ధభేరిని జయప్రదం చేయండి

- చేనేత ఐక్యవేదిక స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దామోదర్

చిల్పూరు/జఫర్‌గఢ్/కొడకండ్ల: పద్మశాలీల రాజ్యాధికారమే లక్ష్యంగా ఈనెల 13న జగిత్యాల జిల్లా కోరుట్లలో నిర్వహించే పద్మశాలీ రాజకీయ యుద్ధభేరి ఆత్మగౌరవ సభకు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని సంఘం మండల అధ్యక్షుడు, చేనేత ఐక్యవేదిక స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ గజ్జెల దామోదర్, జఫర్‌గఢ్, కొడకండ్ల మండల అధ్యక్షులు డాక్టర్ మామిడాల సోమనారాయణ, పసునూరి మధుసూదన్ పిలుపునిచ్చారు. చిల్పూరు మండలంలోని చిన్నపెండ్యాల, ఆయా మండల కేంద్రాల్లో శుక్రవారం సంఘం నాయకులతో కలిసి చలో కోరుట్ల మహాసభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను దామోదర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ వర్గాల్లో అత్యధిక జనాభా కలిగిన పద్మశాలీలకు రాజకీయంగా అవకాశం కల్పించక పోవడం బాధాకరమన్నారు.ప్రత్యేక రాష్ట్ర సాధనలో ప్రధాన భూమికను పోషించనున్న రాష్ట్రంలో సరైన గుర్తింపు లభించకపోవడం శోచనీయమన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు న్యాలపోగుల రఘునాథ్, డాక్టర్ వేముల వెంకటేశ్వర్లు, ఎల్ఐసీ రాజన్‌బాబు, పేరాల నాగభూషణం, మంతెన రాజు, సామల రాములు, పేరాల రాజమౌళి, జఫర్‌గఢ్‌లో చేనేత ఐక్య వేదిక మండల అధ్యక్షుడు కన్న సోమశేఖర్, గ్రామ అధ్యక్షుడు బైరి వెంకటేశ్వర్లు, అంజయ్య, సోమయ్య, నర్సింగం, అశోక్, నర్సయ్య, యాదగిరి, వెంకటయ్య, సోమశేఖర్, అంజయ్య, పాల్గొన్నారు. కొడకండ్లలో సంఘ నాయకులు ఉపేందర్, ప్రభాకర్, వెంకన్న, పాండురంగం,వెంకటేశ్వర్లు, నవీన్, రమేష్, మో హన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



చిల్పూరు : వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు



కొడకండ్లలో...

అభివృద్ధిలో ఆదర్శంగా నిలవడం అభినందనీయం



మాట్లాడుతున్న ఏపీఎం నాగేశ్వర్

నర్మెట: ధనలక్ష్మి గ్రామైక్య సంఘం అభివృద్ధి బాటలో నడుస్తూ ఆదర్శంగా నిలువడం అభినందనీయమని ఏపీఎం కె.నాగేశ్వర్‌రావు, సీసీ కవిత అన్నారు. మండలకేంద్రంలోని సంఘం భవనంలో 15వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అధ్యక్షురాలు ఆమెడపు గీత అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం మహిళాభివృద్ధికి బ్యాంక్ లింకేజీతో ఒక్కో సంఘానికి రూ. 20 లక్షలు ఇస్తుందన్నారు. మహిళలు అభివృద్ధి సాధిస్తే వారి కుటుంబాలు, సమాజం అభివృద్ధి పథంలో పయనిస్తుందని అన్నారు. సంఘాల వాటాధనం రూ. 21,880, ఎస్‌హెచ్‌జీ సాధారణ పొదుపు వసూలు రూ.5,38,198, స్త్రీ నిధి పొదుపులు రూ. 2,28,000, మండల సమాఖ్య రుణనిల్వ రూ. 6,64,000, స్త్రీ నిధి రుణ నిల్వ 29,62,897, ఇతర అప్పులు 15,298, పావలా వడ్డీలు రూ.29 వేలతో కలుపుకుని రూ.16.23 లక్షలు లాభాల బాటలో నడుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు కొన్నె అండాళు, కార్యదర్శి తీగుళ్ల అండాళు, కోశాధికారి గుర్రాల పద్మ, వీఓఏ గంగం లత, సహాయ కార్యదర్శి చింతకింది జయ, సభ్యులు పాల్గొన్నారు.

పట్టణ పెరిక సంఘం ఎన్నిక

కొడకండ్ల : పురగిరి క్షత్రియ పెరిక సంఘం పట్టణ కమిటీని శుక్రవారం మండలకేంద్రంలో ఎన్నికల అధికారులు రాము, కడారి సోమయ్య, చిలుసారి సుధాకర్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పేరం కృష్ణ, గౌరవ అధ్యక్షులుగా పేరం రాము, దిడ్డి భిక్షంలు, ప్రధాన కార్యదర్శిగా కడారి శివరాములు, ఉపాధ్యక్షునిగా ముత్తినేని సత్తయ్య, కోశాధికారిగా చిలుసాని మల్లేష్, కార్యదర్శులుగా బందు సైదులు, చిలుసాని సుధాకర్, యాదగిరి, సలహాదారులుగా సత్తయ్య, ఉప్పల చిన్నసోమయ్య, బొల్లెపెల్లి ముత్తయ్యతో నాటి కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

ప్రత్యేక పూజలు

స్టేషన్‌ఘన్‌పూర్: అధిక శ్రావణమాసం సందర్భంగా మండలంలోని ఇప్పగూడెంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు శుక్రవారం వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి మంగళహారతులు, కుంకుమ పూజలు, ఓడిబియ్యం పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహిళలు ప్రత్యేకంగా 33 రకాల ప్రసాదాలను తయారు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించి అనంతరం వాయినాలు స్వీకరించారు. అధిక శ్రావణమాసంలో శ్రీలలితాదేవి అమ్మవారికి, వాసవీమాతకు పూజలు చేయడం ఎంతో శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో భార్గవి, రవళి, సుజాత, సరిత, పుణ్యవతి, నాగమణి, లలిత, రమ, మంజుల, పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి

స్టేషన్‌ఘన్‌పూర్/కొడకండ్ల : ప్రభుత్వ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని, పెండింగ్ బిల్లులు, పీఆర్‌సీ త్వరగా మంజూరు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కె.మహిపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలో చేపట్టిన సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల్ని పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో గీరెడ్డి ప్రమోద్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, మురళి, ప్రసాద్, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. కొడకండ్ల మండల పరిధి వివిధ పాఠశాలల్లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల ఎల్లారెడ్డి, అనిల్, గద్దం చంద్రమౌళి, విజయ్‌కుమార్, శ్రీనివాసచారి, వెంకటేశ్వర్లు, ఉమేష్ పాల్గొన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్ : సభ్యత్వ నమోదు చేస్తున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి

ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

జనగామ రూరల్: దోస్త్ ఐడి పేరుతో విద్యార్థులకు తెలియకుండా అక్రమంగా అడ్మిషన్లు చేస్తున్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ పట్టణ కన్వీనర్ హృతిక్ సాయి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాల ఎదుట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అనుమతులు లేకుండా అడ్మిషన్ తీసుకొని ఇష్టం లేదంటే బెదిరింపులకు గురిచేస్తున్నారని అన్నారు. మెరిట్ ప్రకారం సీట్లు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వంశీ, కార్తీక్, అరవింద్, ఉదయ్, నరేష్, గణేష్, పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నర్మెట : మండలంలోని మల్కపేటకు చెందిన లకావత్ సక్కు (75) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సూచనలతో జిల్లా కార్యదర్శులు గంగం నర్సింహారెడ్డి, భూక్య జయరాం, మాజీ జెడ్పీటీసీ గాదె మోహన్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.ఉపసర్పంచ్ బాల్‌సింగ్, సురేష్, నర్మెట పట్టణ యూత్ అధ్యక్షుడు ప్రజ్ఞాపురం శ్రీధర్, రాములు, తిరుపతి, ప్రవీణ్ తదితరులున్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఛాగల్లుకు చెందిన యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఐలపాక శ్రీనివాస్ తండ్రి ఎల్లయ్య గురువారం మృతిచెందాడు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర కుమారుడు ఇమ్మానుయేల్ శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందించారు.

గుండెపోటుతో మాజీ ఎంపీటీసీ మృతి

జఫర్‌గఢ్ : మండలంలోని సూరారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఎండీ.నసీరొద్దిన్ (సికిందర్) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పార్టీ బృందంతో కలిసి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం నసీరొద్దీన్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఎంపీపీ రడపాక సుదర్శన్, ఏఎంసీ చైర్మన్ గుజ్జరి రాజు, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నేతల పరామర్శ

మాజీ ఎంపీటీసీ నసీరొద్దీన్ కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు బొల్లెపల్లి కృష్ణ, దొమ్మాటి సాంబయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు వేర్వేరుగా పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు మంచాల ఎల్లయ్య, మాజీ జెడ్పీటీసీ సదయ్య గౌడ్, రాజేందర్, కత్తుల ఎల్లయ్య, ఉన్నారు.

ఎమ్మెల్సీ కడియంను కలిసిన నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని సముద్రాల గ్రామ మాజీ సర్పంచ్ తాటికొండ కుమారస్వామి, ఉపసర్పంచ్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు హనుమకొండలో ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామం నుంచి సూరారం వరకు బీటీ రోడ్డు నిర్మించాలని కడియంను కోరారు. అదేవిధంగా ఘన్‌పూర్ రిజర్వాయర్ మెయిన్ కెనాల్ నుంచి నీరు విడుదల చేసిన ప్రతీసారి గ్రామంలోని వ్యవసాయ పంటలకు సాగునీరు రావడం లేదన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరగా ఎమ్మెల్సీ శ్రీహరి సానుకూలంగా స్పందించారు. కలిసిన వారిలో నాయకులు రమేష్, రాజు, సత్తిరెడ్డి, యాదగిరి, గాలయ్య, నరహరి, నవీన్, అనీల్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

భీమానాయక్ సేవలు మరువలేనివి

చిల్పూరు: గార్లగడ్డ తండా నూతన పంచాయతీగా ఏర్పాటు చేయించడంతో పాటు గ్రామాభివృద్ధిలో భీమానాయక్ చేసిన సేవలు మరువలేనివని గార్లగడ్డతండ, ఫతేపూర్ సర్పంచ్‌లు తులసి, రూప్లా నాయక్ అన్నారు. మండలంలోని గార్లగడ్డతండాలో శుక్రవారం భీమానాయక్ వర్ధంతిని సంజీవ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన ఆశయ సాధనకు పాటుపడుతామన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి రంగారెడ్డి, మోహన్, బాబురావు, యాకునాయక్, రవి, శంకర్, రమేష్, భిక్షపతి, బిక్కు, కాలురాం, రాజు, పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

పాలకుర్తి టౌన్: ఆజాది కా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా బీజేపీ మండల అధ్యక్షుడు కమ్మగాని శ్రీకాంత్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించినట్లు బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పెదగాని సోమయ తెలిపారు. శుక్రవారం స్థానిక చిట్యాల ఐలమ్మ స్మారక మార్కెట్ యార్డు సమీపంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలకు సేవా కార్యక్రమాలకు జరుపడానికి బీజేపీ పిలుపునిచ్చిందని అన్నారు.కార్యక్రమంలో బీజేపీ ఉపాధ్యక్షుడు దొంగరి మహేందర్, నియోజకవర్గ సహాయ కన్వీనర్ సుంకరనేని కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు

పాఠశాలకు వాటర్‌ప్లాంట్ బహూకరణ

జనగామరూరల్: మండలంలోని గానుగుపహాడ్ ఉన్నత పాఠశాలకు వైటెక్ సిస్టమ్స్ ఆసియా ప్రైవేట్ లిమిటెడ్ వి యాక్ట్ హైదరాబాద్ సోషల్ సర్వీస్ వారు రూ.80 వేల విలువ చేసే డిజిటల్ ఆర్వో వాటర్‌ప్లాంటు సేవా సంస్థ డైరెక్టర్ విభూతి సంజీవయ్య, సీనియర్ డైరెక్టర్ జొన్నల శ్రీనివాస్ శుక్రవారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు ఈ వాటర్ ప్లాంటును అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రష్మీ, స్పందన, ప్రేరణ, వినోద్, శివ, చైతన్య, మనీష్, కిరణ్, మణిరత్నంరెడ్డి, ప్రధానోపాధ్యాయులు వంగాల రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా రాజశేఖర్‌గౌడ్

రఘునాథపల్లి: మండలంలోని ఖిలాషాపూర్‌కు చెందిన రంగు రాజశేఖర్‌గౌడ్ బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా నియామకం కాగా శుక్రవారం మండల కేంద్రంలో రాజేష్‌గౌడ్‌కు బీజేపీ మండల అధ్యక్షుడు వల్లాల వెంకటేష్‌యాదవ్ నియామక పత్రాన్ని అందజేశారు. రాజశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ మండలంలో బీజేపీని మరింత బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ద్యావర రాజు, బీజేవైఎం మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

లింగాలఘణపురం: చేనేత కార్మికుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. శుక్రవారం స్థానిక దీప్తీ ఫంక్షన్ హాల్‌లో జాతీయ చేనేత వారోత్సవాల్లో భాగంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ చేనేత కార్మికులకు త్రిఫ్ట్ ఫండ్‌లో చేనేత కార్మికుడు రూ.1200 చెల్లిస్తే రూ.2400 లు ప్రభుత్వం అందజేస్తుందని, నూలు సబ్సిడీలో కార్మికుడికి నెలకు రూ.3000, స్టాండ్ మగ్గాలకు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం అందజేస్తుందని, అదే విధంగా చేనేత బీమా రూ.5 లక్షలు అందజేస్తుందని వివరించారు. కార్యక్రమంలో చేనేత శాఖ ఏడీ చౌడేశ్వరీ, ఏడీఓ రజిని, ఎంపీపీ జయశ్రీ, సొసైటీ అధ్యక్షుడు నాగభూషణం, బచ్చన్నపేట అధ్యక్షుడు రాంమూర్తి, చంద్రయ్య, పాల్గొన్నారు.



బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

- గోశాల రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్



దూడలను పంపిణీ చేస్తున్న మహేష్ అగర్వాల్

దేవరుప్పుల : జీవకోటి ప్రాణులకు ఆక్సిజన్ కరవవుతున్న తరుణంలో ఆడపడుచులు గోమయంతో చేసిన రాఖీలను కట్టి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని గోశాల రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ సూచించారు. శుక్రవారం మండలంలోని మాదాపురంలో పరమేశ్వర గోశాల ఆధ్వర్యంలో 10 మంది రైతులకు లేగదూడలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోమయంతో తయారు చేసిన రాఖీలు వాడడంతో వాటిలో ఉన్న సీడ్స్ గింజలు,అనేక పండ్ల మొక్కలు జామ వాతావరణం కాలుష్యాన్ని కాపాడే ఇతర గింజలతో ఆర్గానిక్ ఉండడంతో బహుళ ప్రయోజనాలు పొందుతారన్నారు. హరితహరం కోసం మహిళలు మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గుర్రం ప్రవంతి క్రాంతి, వార్డు సభ్యులు భాస్కర్, గోశాల నిర్వాహకులు భూక్యా లక్కు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

'ముద్ర' రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

చిల్పూరు: విజయ డెయిరీ ఆధ్వర్యంలో ఎస్‌బీఐ నుంచి ఇచ్చే 'ముద్ర' రుణాలు పొందిన పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విజయ డెయిరీ డీడీ ధన్‌రాజ్ అన్నారు. కృష్ణాజీగూడెం నుంచి 10 మందికి పాడి రైతులు దరఖాస్తు చేసుకోగా.. ఆరుగురికి మంజూరైన ముద్ర రుణాల కింద బెంగళూరు నుంచి 19 ఆవులను తీసుకురాగా వాటిని శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం డీడీ మాట్లాడుతూ పాడి పరిశ్రమపై ఉత్సాహంగా ఉన్న రైతులు డెయిరీ సహకారం అందిస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో బీఎంసీయూ మేనేజర్ లింగారెడ్డి, సూపర్‌వైజర్ హన్మంతు, చైర్మన్ సాదం రమేష్, వైస్ చైర్మన్ సంగి రమేష్, డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.



రుణాలతో తీసుకున్న ఆవులను పరిశీలిస్తున్న ధన్‌రాజ్

క్రికెట్ పోటీలు ప్రారంభం

జనగామ రూరల్: ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ సందర్భంగా జిల్లాలోని ఫొటోగ్రాఫర్స్‌కు క్రికెట్‌టోర్నమెంట్‌ను ఏసీపీ దేవేందర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. పట్టణంలోని ప్రిస్టెన్ గ్రౌండ్‌లో పోటీలు నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్స్ వృత్తి స్వీకరిస్తూ అనేక ఆటుపోటులు ఎదుర్కొని తమ గమ్యాన్ని కొనసాగిస్తుండడం గొప్పవిషయం అన్నారు. ఫొటోగ్రాఫర్స్‌కి ఎల్లవేళలా సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు గోలి చంద్రప్రకాష్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు రాము, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు రచ్చ మోహన్, వేణుమాధవ్, రాజశేఖర్, కృష్ణమోహన్, సూర్యప్రకాష్, దేవేందర్, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్యశిబిరం

రఘునాథపల్లి: హన్మకొండ శరత్‌మాక్స్ విజన్ వారి సహకారంతో రఘునాథపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు పండి శంకర్‌రెడ్డి మాట్లాడుతూ శిబిరానికి వచ్చిన 65 మందికి నిపుణులైన నేత్ర వైద్యులు పరీక్షలు నిర్వహించారన్నారు. అవసరమైన వారికి త్వరలో హనుమకొండలో శస్త్రచికిత్స చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ లయన్స్ మాజీ అధ్యక్షుడు కూరెళ్ల ఉపేందర్, శంకరయ్య, ప్రదీప్‌కుమార్, రాజు, శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌కుమార్, అనిల్‌కుమార్, కర్ణాకర్, మునిరాజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ముగ్గురు మోసగాళ్ల రిమాండ్

రఘునాథపల్లి: మండలంలోని అశ్వరావుపల్లిలో ఓ వ్యాపారికి భూమి విక్రయించి పెద్ద ఎత్తున డబ్బులు తీసుకొని రిజిస్ట్రేషన్ చేయకుండా మోసగించిన నలుగురిలో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రఘుపతి శుక్రవారం తెలిపారు. హైదరాబాద్ తార్నాకకు చెందిన వ్యాపారి కాటూరి శ్రీనివాసరావుకు అశ్వరావుపల్లి రెవన్యూ పరిధిలోని 78– 29 ఎకరాల భూమిని అదే గ్రామానికి చెందిన తూముకుంట్ల పవన్‌కుమార్, ఎలిశాల తిరుపతి, సురవి సత్తిరెడ్డి, నడికట్టు మనోహర్‌రెడ్డిలు విక్రయించారు. ఇందుకుగాను విడతలవారీగా శ్రీనివాసరావు నుంచి రూ.2 కోట్ల 55 లక్షలు నగదు తీసుకున్నారు. రిజిస్ట్రేషన్ చేయకపోగా ఇదే భూమిని తిరుపతి పేర 18–29 ఎకరాలు, మనోహర్‌రెడ్డి పేర 60–0 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. తనకు రిజిస్ట్రేషన్ చేయకుండా వారే రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో మోసపోయానని గ్రహించిన శ్రీనివాసరావు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని తిరుపతి, సత్తిరెడ్డి, మనోహర్ రెడ్డిలను అరెస్ట్ చేసి రిమాండ్ చేశామని పవన్‌కుమార్ పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరి మహిళలపై కేసు

తరిగొప్పుల: తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన పాత ఇనుప సామాను కొనుగోలు చేసే ఇద్దరి మహిళలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని బొంతగట్టు నాగారం గ్రామానికి చెందిన పాండ్యాల వెంకటయ్య కుటుంబ సభ్యులతో జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్‌లో నివసిస్తున్నాడు. కాగా మడికొండ ఎంఐ నగర్‌కు చెందిన కడమంచి మరియా, తూర్పాటి మైసమ్మ ఊరూరా తిరుగుతూ పాత ఇనుప సామాను కొనుగోలు చేస్తుంటారని తెలిపారు. ఈ క్రమంలో శుక్రవారం వెంకటయ్య ఇంటికి తాళం వేసి ఉండటం గమనించి తాళం పగులగొట్టి రూ.8వేల విలువగల ఇత్తడి వంట సామగ్రిని ఎత్తుకెళ్తుండగా వెంకటయ్య సోదరుడు గమనించి పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. చోరీకి పాల్పడిన సదరు మహిళలపై కేసు నమోదు చేసి బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

చోరీకి గురైన ట్రాక్టర్ పోలీసులకు అప్పగింత

రఘునాథపల్లి: మండలంలోని గోవర్ధనగిరిలో వ్యవసాయ క్షేత్రంలో మూడు రోజుల క్రితం చోరీ అయిన ట్రాక్టర్‌ను బాధితుడు, పలువురు రైతులు గుర్తించి పోలీసులకు అప్పగించిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ముప్పిడి రాజు తన వ్యవసాయక్షేత్రంలో పొలం దున్ని ట్రాక్టర్‌ను అక్కడే ఉంచాడు. ఉదయం వెళ్లి చూడగా ట్రాక్టర్ లేకపోవడంతో ఈ నెల 9న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ట్రాక్టర్‌ను గుర్తించేందుకు బాధితుడు పలువురు రైతులతో కలిసి ఊరూరా తిరిగారు. శుక్రవారం ఉదయం జఫర్‌గఢ్ మండలం కస్రాతండాలో నంబర్ చెడిపిన ట్రాక్టర్‌తో ఓ వ్యక్తి దుక్కి దున్నుతుండగా గుర్తించారు. ట్రాక్టర్ వద్దకు చేరుకోగానే పరిగెడుతున్న అతన్ని పట్టుకొని ట్రాక్టర్‌తో సహా పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. కొన్నాళ్లుగా గొర్రెలు, పాడి గేదెలు, విలువైన వ్యవసాయ పరికరాలు అపహరణకు గురయ్యాయని, దుండగులపై కఠిన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని పెద్ద ఎత్తున రైతులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేశారు. ట్రాక్టర్ చోరీ చేసిన వారు ఇతర ప్రాంతాల్లోనూ పలు చోరీలు చేసినట్లు, ఇందులో ఓ ముఠా ఉన్నట్లు పోలీసులు కూపీ లాగుతున్నారు.

దాడికి పాల్పడిన యువకుడిపై కేసు

తరిగొప్పుల: మొబైల్ ఫోన్ రిపేరు చేసిన డబ్బులు అడిగినందుకు షాపు యజమానిపై దాడికి పాల్పడిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ శుక్రవారం తెలిపారు. స్థానిక సాయికృష్ణ మొబైల్ షాపు యజమాని ఎదునూరి సాయికృష్ణకు తరిగొప్పులకు చెందిన ఎర్రవెల్లి దిలీప్ మధ్య సెల్‌ఫోన్ రిపేరు చేసిన డబ్బులు అడిగిన విషయం గురువారం రాత్రి గొడవకు దారి తీసింది. ఈ క్రమంలో షాపు యజమానిపై దిలీప్ భౌతిక దాడికి పాల్పడినట్లు తెలిపారు. సాయికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైలుకింద పడి వ్యక్తి మృతి

జనగామ: మండలంలోని పెంబర్తి రైల్వేస్టేషన్ సమీపంలో రైలులో నుంచి ప్రమాదవశాత్తు కింద పడి ఓ మూగ వ్యక్తి పడి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. రైల్వేపోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. రైలు నుంచి ప్రమాదవశాత్తు కిందపడిన జైతిన్‌కు తీవ్ర గాయాలు కాగా, 108 అంబులెన్స్ సహాయంతో రైల్వే సిబ్బంది జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందగా మృతదేహాన్ని పోస్టుమార్టం గదిలో భద్రపరిచారు. మృతుడు హిందీ మాత్రమే మాట్లాడారని జీఆర్‌పీ పోలీసులు తెలిపారు. అడ్రస్ తెలిసిన వారు జనగామ జీఆర్‌పీ సిబ్బంది–8712658603 నంబర్‌ను సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

నర్మెట: విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని లయన్స్‌క్లబ్ అభయ, హనుమకొండ సెక్రటరీ వంగ వసంతారెడ్డి అన్నారు. మండలంలోని వెల్దండ ఉన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు శుక్రవారం రూ. 20 వేల విలువ చేసే నోట్‌బుక్స్ ఒక్కో విద్యార్థికి ఏడు చొప్పున సర్పంచ్ నర్రా వెంకటరమణారెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఇర్రి వెంకట్ రెడ్డి, వంగ హేమంత్ రెడ్డి, ఎస్సెమ్సీ చైర్‌మెన్ పి. లక్ష్మి, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న వసంతారెడ్డి